విద్యార్థులు ఉన్నత స్థానాల్లో రాణించాలి

నాగర్‌కర్నూల్: విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానంలో రాణించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. నాగర్‌కర్నూల్ పట్టణంలోని బాలుర కళాశాల వసతిగృహాన్ని గురువారం సాయంత్రం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతిగృహంలోని వసతులు, భోజనంపై కలెక్టర్ ఆరా తీశారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా భోజనం మెనూ ప్రకారం అందజేస్తున్నారా.. అని తెలుసుకున్నారు. గతేడాది ఇంటర్, డిగ్రీలో ఉత్తీర్ణత శాతం వివరాలను ఆరా తీశారు. పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాన్ని కలెక్టర్ పరిశీలించారు. సమస్యలు తలెత్తకుండా విద్యార్థులకు అందించే భోజనం మెనూ ప్రకారంగా అందజేయాలని వార్డెన్‌ను ఆదేశించారు. వారం రోజుల తర్వాత వసతిగహాన్ని మళ్లీ సందర్శిస్తానని తెలియజేశారు. కలెక్టర్ వెంట సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి రామ్లాల్ తదితరులు ఉన్నారు.

మౌలిక వసతులకు ప్రత్యేక చొరవ..

గురుకుల పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులకు సూచించారు. గురువారం సాయంత్రం కలెక్టర్ ఛాంబర్‌లో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల నిర్వహణ,



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మౌలిక సదుపాయాల కల్పనపై ఎస్సీ గురుకుల పాఠశాలల అద్దె భవనాల యజమానులు, సంక్షేమ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రతి జిల్లా స్థాయి అధికారి ఆకస్మిక తనిఖీ నిర్వహించడంతో పాటు, నెలలో ఒకరోజు రాత్రి బస చేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు బోధన ప్రమాణాలు కూడా పెంపొందించాలన్నారు. మొదటి ప్రాధాన్యతగా తాగునీటి సౌకర్యం, అదేవిధంగా విద్యార్థుల సంఖ్యను దృష్టిలో పెట్టుకొని మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని సూచించారు. పనులు చేపట్టకముందు, పనులు పూర్తయిన తర్వాత తీసిన ఫొటోలను సమర్పించాలన్నారు. వసతిగృహాలకు పంపిణీ చేసే కాంట్రాక్టర్లు ఒత్తిడికి గురికాకుండా నాణ్యమైన సరుకులను సరఫరా చేసేలా చూడాలని సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, ఎస్సీ గురుకులాల డీసీఓ, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రామ్‌లాల్, డీఈఓ గోవిందరాజులు, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్ అద్దె భవనాల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వంట మనిషి, అటెండర్ పోస్టుకు దరఖాస్తులు

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని కేజీబీవీ పాఠశాలలో సహాయ వంట మనిషి, అటెండర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ శంకర్‌నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, అటెండర్ కోసం పదో తరగతి పాసై, సహాయ వంట మనిషికి ఏడో తరగతి పాసై ఉండాలన్నారు. దరఖాస్తులను సెప్టెంబర్ 3వ తేదీలోగా కేజీబీవీ పాఠశాలలో అందజేయాలని తెలియజేశారు.

రైతులకు అందుబాటులో యూరియా

కోడేరు: మండల కేంద్రంతో పాటు సింగాయిపల్లి సింగిల్ విండో కార్యాలయంలో రైతులకు యూరియా అందుబాటులో ఉందని విండో చైర్మన్ చిన్నారెడ్డి తెలిపారు. యూరియా బస్తా ధర రూ.270లు ఉంటుందని, కావాల్సిన రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకురావాలని సూచించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

నంబర్ ప్లేట్ లేకుంటే చర్యలు

ఉప్పునుంతల: నంబర్ ప్లేట్ లేకుండా రోడ్డుపై వాహనాలు నడిపితే ఆ వాహనాలను సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ లెనిన్ గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. రోడ్డుపై ప్రయాణించే సమయంలో వాహనం వెంటనే రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ కాగితాలు కలిగి ఉండి వాహనం ముందు, వెనుక వైపు నంబర్ ప్లేట్ కనిపించేలా శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ట్రాక్టర్ ట్రాలీ వెనుక భాగంలో రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్ తప్పనిసరిగా అమర్చి, రాత్రి సమయంలో కనిపించేలా త్రికోణం ఆకారంలో రేడియం స్టిక్కర్లను అంటించాలని పేర్కొన్నారు. ఇక నుంచి నిబంధనలు పాటించని వాహనదారులపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

కల్వకుర్తి రూరల్: నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న కల్వకుర్తి పట్టణంలోని ఓ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకుడు సంతోష్ డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలను సందర్శించారు. ఫీజుల వివరాలపై పాఠశాల యాజమాన్యాన్ని ప్రశ్నిస్తే తమతో వాగ్వాదానికి దిగారని ఆరోపించారు. కార్యక్రమంలో మోహన్, మహేందర్, శ్యాం, సాయి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ



లింగాల: మండల పరిధిలోని అంబట్‌పల్లిలో నూతనంగా ఏర్పాటు చేయనున్న వాల్మీకి విగ్రహం కోసం గురువారం దిమ్మె నిర్మాణానికి భూమి పూజ చేశారు. బోయ కులపెద్దల ఆధ్వర్యంలో విగ్రహం నెలకొల్పేందుకు దాతలు ముందుకు వచ్చారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నారాయణగౌడ్, సాయిరెడ్డి, వెంకట్‌రాజు, జగదీష్, వెంకటస్వామి పాల్గొన్నారు.

చెంచులకు వాటర్ ప్లాంట్ ఏర్పాటు

మన్ననూర్: చెంచుల ఆరోగ్య రక్షణకు అపోలో ఫార్మసీ హైదరాబాద్ ఆధ్వర్యంలో వాటర్ ఫిల్టర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. అమ్రాబాద్ మండలం మాచారం గ్రామం గేటు వద్ద ఏర్పాటు చేయగా.. అపోలో ఫార్మసీ యాజమాన్యంతో కలిసి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రోహిత్ రెడ్డి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో డీటీడీఓ ఫిరంగి, అపోలో, ఐటీడీఏ, అటవీశాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవ్వాలి

నాగర్‌కర్నూల్(బిజినేపల్లి): పదవీ విరమణ పొందిన ఉద్యోగులు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ.. భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని లట్టుపల్లి జెడ్పీహెచ్ పాఠశాలకు చెందిన జీహెచ్‌ఎం రాములునాయక్ పదవీ విరమణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని, ఆ తర్వాత పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలవాలన్నారు. అనంతరం దంపతులను శాలువాతో సన్మానించారు.

ఉద్యోగికి పదవీ విరమణ తప్పదు..

అచ్చంపేట: ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. గురువారం అచ్చంపేట పటేల్ ఫంక్షన్‌హాల్‌లో వైద్య ఆరోగ్యశాఖ కమ్యూనిటీ హెల్త్ అధికారి అశోక్ ప్రసాద్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రజల మన్ననలు పొందిన వారికి ఎల్లప్పుడు గుర్తింపు లభిస్తుందని అన్నారు. సుధాకలాల్, శ్రీనివాసులు, తారాసింగ్, వెంకట్‌దాస్ పాల్గొన్నారు.

నాణ్యత లోపిస్తే చర్యలు

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని కాంప్లెక్స్ హెచ్‌ఎం రమేష్ తెలిపారు. గురువారం సీఆర్‌పీ మల్లారెడ్డితో కలిసి బలాన్‌పల్లి, ఎట్టిదారిపల్లి పాఠశాలలను సందర్శించారు. వివిధ రికార్డులను పరిశీలించి ఎఫ్‌ఎల్‌ఎన్ నిర్వహణ, ఎఫ్‌ఏ1, బేస్‌లైన్ నిర్వహణ గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.

బాండ్ల పంపిణీ



పెద్దకొత్తపల్లి: టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో మండలంలోని యూటీఎఫ్ ఉపాధ్యాయులకు కుటుంబ సంక్షేమ నిధి బాండ్లను గురువారం టీఎస్‌యూటీఎఫ్ మండల కార్యదర్శులు మహేష్‌బాబు, చంద్రశేఖర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కుటుంబ సంక్షేమ నిధిని ప్రారంభించింది. ఉపాధ్యాయులకు అనుకోకుండా ఏమైనా జరిగినప్పుడు, అకాల మరణం జరిగినప్పుడు వారికి ఆర్థికంగా చేయూతనివ్వడానికి ఎఫ్‌డబ్ల్యూఎఫ్ బాండ్లు ఉపయోగపడుతాయని అన్నారు. ఒక్కో కుటుంబానికి రూ.6 లక్షల చేయూతను అందిస్తున్నామని చెప్పారు. మల్లయ్య లక్ష్మీపతి, కర్ణాకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

వెల్దండ: మండల కేంద్రంలోని భారత్ పెట్రోల్ పంపు సమీపంలో హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. కల్వకుర్తి మండలం సీరామ్‌నగర్ తండాకు చెందిన కె.బంద్రి బైక్‌పై హైదరాబాద్ నుంచి కల్వకుర్తి వైపు వెళ్తున్నాడు. వెల్దండ మండల కేంద్రంలో భారత్ పెట్రోల్ పంపు సమీపంలో కొండనాగులకి చెందిన విజయ్‌కుమార్‌బాబు కారులో హైదరాబాద్ వెళ్తున్నాడు. కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొనడంతో బైక్‌పై ఉన్న బంద్రి కాళ్లకు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలియజేశారు. ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలియజేశారు.

కేసు నమోదు

అచ్చంపేట రూరల్: అకారణంగా ఇంటిపై దాడి చేసిన వ్యక్తులపై ఇంటి యజమానురాలు ఫిర్యాదు మేరకు గురువారం సిద్ధాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని బ్రాహ్మణపల్లిలో నివాసం ఉంటున్న నేనావత్ బుజ్జి ఇంటిపై గురువారం అదే గ్రామానికి చెందిన కొందరు దాడి చేశారు. బుజ్జి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ నర్సింహరెడ్డి తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో పోచమ్మ బోనాలు



వెల్దండలో బోనాలతో ఊరేగింపు వెళ్తున్న మహిళలు



తాండ్రలో బోనాల ఊరేగింపు

చారకొండ: మండలంలోని జూపల్లి, జేపల్లిలో గురువారం భక్తిశ్రద్ధలతో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్లి గ్రామ దేవతలైన కోటమైసమ్మ, బొడ్రాయికి ప్రదక్షిణలు చేసి పోచమ్మ దేవాలయానికి చేరుకున్నారు. నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వెంకటయ్య యాదవ్, సుల్తాన్ యాదవ్, రామచంద్రి, లింగం పాల్గొన్నారు.

ఉప్పునుంతల: మండల కేంద్రంలో గురువారం మాదిగ దండోరా ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలు నిర్వహించారు. మండలంలోని మొల్గరలో గ్రామస్తులు బోనాల ఉత్సవాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. జూపల్లిలో వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఈదమ్మ బోనాలను వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

వెల్దండ: మండల కేంద్రంతో పాటు చౌదర్‌పల్లి, పెద్దాపూర్ తదితర గ్రామాల్లో బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవతలైన పోషమ్మ, మైసమ్మ, బొడ్రాయి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పోతురాజుల విన్యాసాలు నిర్వహించారు.

కల్వకుర్తి రూరల్: మండలంలోని తాండ్ర, తర్నికల్ గ్రామాల్లో గురువారం బోనాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.

ధ్యాన్‌చంద్ క్రీడాకారులకు స్ఫూర్తి

నాగర్‌కర్నూల్: ప్రతి క్రీడాకారుడికి హాకీ క్రీడాకారుడు, మేజర్ ధ్యాన్‌చంద్ స్ఫూర్తి దాయకమని తైక్వాండో జిల్లా అధ్యక్షుడు తెప్ప శ్రీనివాస్ అన్నారు. నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ మైదానంలో మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వివిధ క్రీడాకారులు, మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. ధ్యాన్‌చంద్ ఒలింపిక్స్‌లో ఎన్నో పథకాలు సాధించి, దేశ ఖ్యాతిని ప్రపంచ దేశాల్లో చాటి చెప్పారన్నారు. అనంతరం క్రీడాకారులకు జనరల్ నాలెడ్జ్ బుక్కులను పంపిణీ చేశారు. తెప్ప శ్రీనివాస్, ఏ.రవికుమార్, సభ్యులు, మాస్టర్లు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు 2కె రన్

నాగర్‌కర్నూల్ రూరల్: ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని గురువారం మండల పరిధిలోని తూడుకుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 2కె రన్ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు



తూడుకుర్తిలో 2కె రన్‌ను ప్రారంభిస్తున్న ప్రధానోపాధ్యాయుడు రఘు

బి.రఘు 2కె రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. తూడుకుర్తి నుంచి సల్కర్‌పేట వరకు 2 కిలోమీటర్ల పరుగు పందెంలో 150 మంది బాలబాలికలు పాల్గొన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు రాధమ్మ, రమేష్, విమలాదేవి, సఫియా సుల్తానా, రాధా, పద్మమ్మ, అంజయ్య పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ధ్యాన్‌చంద్ జయంతి కార్యక్రమాన్ని కరాటే విద్యార్థులు నిర్వహించారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



వెల్దండలో గురుకుల పాఠశాలలో...

లింగాల: తెలుగు వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకటరామమూర్తి జయంతి సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాషలో విశేష కృషి చేసిన సాహితీ వేత్తలు, కవులకు సంబంధించిన చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేసి, విద్యార్థులకు తెలుగు భాషా గొప్పతనంపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం బషీర్ అహ్మద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషా అభివృద్ధికి గిడుగు వెంకటరామ్మూర్తి చేసిన కృషిని వివరించారు. విద్యార్థులకు తెలుగు భాషపై పోటీ పరీక్షలు నిర్వహించి విద్యార్థులను ప్రోత్సహించారు. వైస్‌ప్రిన్సిపాల్ జానకి, అధ్యాపకురాలు శ్రీలత, స్వప్న, శైనాజ్, కవిత పాల్గొన్నారు.

క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక ప్రణాళిక

నాగర్‌కర్నూల్(బిజినేపల్లి): రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యతో పాటు క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తుందని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. గురువారం తిమ్మాజిపేట మండల కేంద్రంలో మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. గ్రామీణ క్రీడాకారుల్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నిర్విరామంగా పనిచేస్తుందన్నారు. విద్యార్థుల్ని విద్య ఆర్థిక ప్రయోజకులుగా మారిస్తే, క్రీడలు వారిని దృఢంగా చేస్తాయన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి..

కోడేరు: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఎస్‌ఐ గోకారి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో మండల స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు ప్రారంభించారు. పోటీల్లో గెలుపొంది జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఎంపిక కావాలన్నారు.

పెద్దకొత్తపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు క్రీడల్లో రాణించాలని సింగిల్‌విండో మాజీ చైర్మన్ బాలస్వామి అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా వెన్నచర్ల ఉన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

వెల్దండ: మండల పరిధిలోని గుండాలలోని ఏకలవ్య పాఠశాలలో గురువారం ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు నిర్వహించారు.



క్రీడాకారుల్ని అభినందిస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

కొల్లాపూర్ రూరల్: యువత క్రీడలో రాణించాలి, మానసిక ఉల్లాసానికి ఆటలు ఎంతో ఉపయోగపడుతాయని మున్సిపల్ చైర్‌పర్సన మేకల రమ్య అన్నారు. గురువారం పట్టణంలోని స్టేడియం మినీ గ్రౌండ్‌లో 68వ ఎస్‌జీఎఫ్‌ఐ మండల స్థాయి ఆటల పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఆటలు ఆడటంతో శారీరక బలం పెంపొందుతుందని, మానసిక వికాసం పెరుగుతుందన్నారు. మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ మహిమూదాబేగం, నరసింహారావు, ధర్మతేజ పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా విద్యార్థులకు ఆట, పాటలు నిర్వహించారు. పీడీ చంద్రకళ, బ్రహ్మేంద్రయాదవ్, శంకర్, శ్రీలత పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

పెద్దకొత్తపల్లి: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో కరాటే నేర్చుకుంటున్న విద్యార్థులకు ఎస్‌ఐ సతీష్ గురువారం బహుమతి అందజేశారు. అశోక్ గౌడ్, రఘుపతిరెడ్డి, దండు నర్సింహ, ఎల్లయ్య పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ క్రీడలు, వ్యాసరచన, ఉపన్యాస, క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సునీత పద్మాలయ, రజిత పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

ఉప్పునుంతల: స్థానిక పీఏసీఎస్‌లో పంట రుణం తీసుకొని మృతిచెందిన మండలంలోని కాంసానిపల్లికి చెందిన రైతు బొల్లు రాములు కుటుంబానికి గురువారం డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి చేతులమీదుగా రైతు భార్య చంద్రకళకు రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కు అందజేశారు. తీసుకున్న పంట రుణాలు సకాలంలో రెన్యూవల్ చేసుకుంటే రైతులకు రూ.2 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని డీసీసీబీ చైర్మన్ సూచించారు. పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్‌రావు, నరేందర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి,



చెక్కు అందజేస్తున్న ఎంపీ మల్లురవి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే వంశీకృష్ణ

రవీందర్‌రావు, అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

తెలకపల్లి: రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో బ్యాంక్ ఆఫ్ బరోడా ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్ శ్రీనివాసులు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ రాష్ట్ర వ్యాప్తంగా 55 శాతం మందికి రుణమాఫీ వర్తించలేదన్నారు. విజయ్‌గౌడ్, గోపస్ లక్ష్మణ్, భాస్కర్, కాశన్న, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

కల్వకుర్తి రూరల్: షరతులతో రుణమాఫీ చేయడం సరికాదని, రూ.2 లక్షల పంట రుణం తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ.. సీపీఎం ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆంజనేయులు మాట్లాడారు. ఆగస్టు 15వ తేదీ వరకు 3 విడుతలుగా రుణమాఫీ చేశామని, ప్రభుత్వం చెప్పినప్పటికీ 50 శాతం మంది రైతులకు రుణమాఫీ జరగలేదన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి అందజేశారు. మల్లయ్య, గాల్‌రెడ్డి, భీమయ్య పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి మల్లేష్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ అశోక్‌కు వినతి అందజేశారు.



తెలకపల్లి బరోడా బ్యాంకు ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

బల్మూర్: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ.. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం, కేవీపీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం సంబంధిత అధికారులకు వినతి అందజేశారు. శివకుమార్, సీపీఎం నాయకులు శంకర్‌నాయక్, భాస్కర్, నాగయ్య, శ్రీను పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి దశరథం ఆధ్వర్యంలో తహసీల్దార్ యూసుఫ్ అలికి వినతి అందజేశారు. సీపీఎం నాయకులు శంకర్, ఈశ్వర్, సతీష్, బాలస్వామి పాల్గొన్నారు.

కొల్లాపూర్ రూరల్: అర్హులందరికీ రుణమాఫీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు.

గడువులోగా దుస్తులు అందజేస్తాం..

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు డ్రెస్‌లు అందించేందుకు గురువారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో కటింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీఎం శేకర్ మాట్లాడారు. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల మహిళా సంఘాల సహాయ సహకారాలతో మొదటి విడత తయారైన దుస్తులను ఆయా పాఠశాలలకు అందజేశామన్నారు. ప్రస్తుతం రెండో విడత వచ్చిన దుస్తులను కటింగ్ చేసేందుకు కట్టర్స్ ద్వారా ప్రారంభించామన్నారు. కటింగ్ పూర్తయిన వెంటనే ఆయా మహిళా సంఘాల సభ్యులకు అందజేసి, గడువులోగా పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఐకేపీసీసీలు లక్ష్మణ్, పార్వతమ్మ, పద్మ పాల్గొన్నారు.



దుస్తులు కటింగ్ చేస్తున్న సిబ్బంది

విద్యార్థులకు సన్మానం

కల్వకుర్తి రూరల్: మండలంలోని గుండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు సన్మానించి నగదును బహుమతిగా అందజేశారు. 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపిన నందినికి రూ.20 వేలు, అక్షిత, పూజలకు చెరో రూ.10వేలు అందజేయగా.. కృష్ణారెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని బాగా చదివి ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వెంకటయ్య, కిష్టారెడ్డి, వసంత తదితరులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేత

కల్వకుర్తి రూరల్: మండలంలోని మార్చాలకి చెందిన రామస్వామి అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. భారత రాష్ట్ర సమితి గ్రామ కమిటీ అధ్యక్షుడు పుల్లారెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ బాలయ్య ఆధ్వర్యంలో గురువారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.

బాధిత కుటుంబానికి..

పట్టణానికి చెందిన భారతమ్మ కిడ్నీ, గుండె సమస్యతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సమాచారం తెలుసుకున్న మిత్ర ఫౌండేషన్ సభ్యులు రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. చంద్రకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వన మహోత్సవం



మన్ననూర్: శ్రావణ మాసం చివరి రోజులు కావడంతో మన్ననూర్‌లోని వివిధ కాలనీల కుటుంబాల వారు గురువారం వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని బుడగజంగాల, ఉమామహేశ్వరం, వేణుగోపాలస్వామి ఆలయం, పాతబజారు తదితర కాలనీలకు చెందిన మహిళలు అలంకరించిన గంపలను తలలపై ధరించి, ఉత్తర, దక్షిణం దిశలకు గ్రామం వెలుపలకు తమ పిల్లాపాపలతో వెళ్లారు. ప్రకృతి దేవతలను ఆరాదించి నైవేద్యాలు సమర్పించి, సహపంక్తి వనభోజనాలు చేశారు.

గ్రామపంచాయతీల తనిఖీ

తాడూరు: మండలంలోని ఇంద్రకల్ గ్రామపంచాయతీని ఎంపీడీఓ జ్యోతిపరోసియా గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాబ్ కార్డు అప్‌డేషన్, ఉపాధిహామీ రిజిస్టర్‌లతో పాటు గ్రామపంచాయతీకి సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. ఉపాధి పనుల వివరాలు, పనుల్లో జరుగుతున్న తీరుతెన్నులు వివిధ అంశాలను ఫీల్డ్ అసిస్టెంట్ జంగయ్యతో వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఉన్నతంగా ఎదగాలి



తెలకపల్లి: విద్యా సహకారాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని సిగ్మా మేనేజింగ్ డైరెక్టర్ చీమర్ల దామోదర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిరుపేద మెరిట్ విద్యార్థులకు విద్యా సహకారాన్ని అందించారు. కొన్ని సంవత్సరాలుగా మండలంలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8, 9, 10 తరగతుల మెరిట్ విద్యార్థులకు వందేమాతరం ఫౌండేషన్ సౌజన్యంతో సిగ్మా అడ్వాన్స్ సిస్టమ్ మేనేజింగ్ డైరెక్టర్ చీమర్ల దామోదర్‌రెడ్డి విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్నారు. రెండు నెలలకు సంబంధించిన రూ.36 వేల నగదు పురస్కారాలను అందజేశారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ మెరిట్ పారితోషకాన్ని 8 సంవత్సరాలుగా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్నామని తెలియజేశారు.

అంటరానితనం కొనసాగడం సిగ్గుచేటు

తాడూరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నేటికీ అంటరానితనం అమానుషంగా కొనసాగడం సిగ్గుచేటని డీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు భరత్ అన్నారు. జస్టిస్ పున్నయ కమిషన్ సిఫారసు ప్రకారం ప్రతి మంగళవారం పౌర హక్కుల దినం నిర్వహించాలని నిబంధనలు ఉన్నా.. అధికారులు అమలు చేయడంలేదన్నారు. అనంతరం తహసీల్దార్ ప్రమీళకు వినతి అందజేశారు. బాలు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

కుటుంబ నిర్ధారణ చేసుకోవాలి

చారకొండ: రేషన్‌కార్డులో పేరు లేకపోవడం, కార్డు లేకపోవడంతో రుణమాఫీకి అనర్హులుగా ఉన్నారని, ఆయా గ్రామాల వారీగా జాబితాలోని లబ్ధిదారులు రుణమాఫీకి కుటుంబ నిర్ధారణ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి తనూజ రాజ్ తెలియజేశారు. గురువారం చారకొండ, తిమ్మాయిపల్లి, సిర్సనగండ్ల గ్రామాల్లో రైతువేదికల్లో రైతులకు కుటుంబ నిర్ధారణ చేపట్టినట్లు పేర్కొన్నారు.